# టైమ్స్ ఆఫ్ వార్త

తెలుగు దినపత్రిక


ఎడిటర్ : మంఖాల దాసు

తెలంగాణ ఆదివారం, 10 - ఆగష్టు - 2025 సంపుటి : 16 సంచిక : 12 పేజీలు 08 వెల : 6/-


## 334 రాజకీయ పార్టీలపై వేటు..

- ఈసీ కీలక నిర్ణయం.. దేశంలో 2,854 గుర్తింపుపొందని పార్టీలు
- తెలంగాణ నుంచి 13 పార్టీలు డీలిస్ట్

**న్యూఢిల్లీ:** దేశంలో రాజకీయ పార్టీల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం సవరించింది. గుర్తింపు పొందని 334 రాజకీయ పార్టీలను జాబితా నుంచి తొలగించింది. నిబంధనల ప్రకారం.. ఈసీ వద్ద నమోదైన రాజకీయ పార్టీలు ఆరేండ్లలో కనీసం ఒక్క ఎన్నికలోనైనా పోటీ చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ పార్టీలు 2019 నుంచి ఒక్క ఎన్నికలోనూ బరిలోకి దిగకపోవడంతో వాటిపై ఈసీ వేటు వేసింది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 334 పార్టీలను జాబితా నుంచి తొలగించినట్టు ఎన్నికల సంఘం తెలిపింది. పేరుకు పార్టీలు పెట్టినప్పటికీ.. వీటికి భౌతికంగా ఎలాంటి కార్యాలయాలు అందుబాటులో లేవని వెల్లడించింది. ఇప్పటివరకు దేశంలో 2,854 గుర్తింపుపొందని పార్టీలు ఈసీ వద్ద రిజిస్టర్ అయి ఉన్నాయి. తాజా చర్యతో ఆ సంఖ్య 2,520కి తగ్గింది. ఎన్నికల సంఘం వద్ద ఉన్న డేటా ప్రకారం.. ప్రస్తుతం దేశంలో ఆరు జాతీయ పార్టీలుగా కొనసాగుతున్నాయి. 67 ప్రాంతీయ రాజకీయ పార్టీలు మనుగడలో ఉన్నాయి.ఎన్నికల సంఘం డీలిస్ట్ చేసిన రాజకీయ పార్టీల జాబితాలో తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 18 పార్టీలు ఉన్నాయి. వీటిలో తెలంగాణ నుంచి 13 పార్టీలు , ఆంధ్రప్రదేశ్ నుంచి ఐదు పార్టీలు ఉన్నాయి.



## అత్యున్నత స్థాయికి భారత రక్షణ ఉత్పత్తులు : రాజ్‌నాథ్

**న్యూఢిల్లీ:** భారత వార్షిక రక్షణ ఉత్పత్తి సర్వకాల అత్యున్నత స్థాయికి చేరుకుందని, ఇది 2024–25లో రూ. 1,50,590 కోట్లని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శనివారం తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం రూ. 1.27 లక్షల కోట్ల ఉత్పత్తి కన్నా ఈసారి 18 శాతం వృద్ధి నమోదయింది. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత రక్షణ ఉత్పత్తి రికార్డు స్థాయికి చేరుకుందని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. రక్షణమంత్రి 'సమిష్టి ప్రయత్నాలను' ప్రశంసించారు. రక్షణ ఉత్పత్తి శాఖ, రక్షణ ప్రభుత్వ రంగ విభాగాలు, ప్రైవేట్ పరిశ్రమలు సహా అన్ని రకాల వాటాదారులు సమిష్టిగా ఈ మైలు రాయిని సాధించారన్నారు. 'ఈ ఆరోహణ పథం భారత రక్షణ పరిశ్రమ బలపడుతున్నది అనడానికి స్పష్టమైన సూచిక' అని పేర్కొన్నారు.

## గేట్ వే ఆఫ్ హైదరాబాద్

- నగరానికి ముఖద్వారంగా ఎత్తయిన ఐకానిక్ టవర్
- అద్భుత పర్యాటక ప్రాంతంగా బాపూఘాట్ పరిసరాలు
- బహుళ ప్రయోజనాలుండేలా మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు
- అధ్యయనం, డిజైన్ల పనులు వేగవంతం చేయండి
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
- గాంధీ సరోవర్ వద్ద ఓఆర్ఆర్‌పై నిర్మాణం
- బహుళ ప్రయోజనాలతో మూసీ పునరుజ్జీవం : సీఎం రేవంత్ ఆదేశం



**టైమ్స్ ఆఫ్ వార్త – హైదరాబాద్ :**
హైదరాబాద్ కోర్ అర్బన్ సిటీ ఏరియాలో చేపట్టే మూసీ పునరుజ్జీవ ప్రాజెక్ట్‌ను బహుళ ప్రయోజనాలుండేలా అత్యంత అధునాతనంగా నిర్మించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులను అదేశించారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు స్వాగతం పలికేలా హైదరాబాద్ ముఖద్వారం గా హిమాయత్‌సాగర్ గాంధీ సరోవర్ దగ్గర ఓఆర్ఆర్‌పై 'గేట్ వే అఫ్ హైదరాబాద్' నిర్మించాలని సూచించారు. ఓఆర్ఆర్‌కు ఒక వైపున ఎకో థీమ్ పార్క్ అభివద్ధి చేసి మరోవైపున బాపూఘాట్ వైపు భారీ ఐకానిక్ టవర్ నిర్మించాలని చెప్పారు. అందుకు తగినవిధంగా డిజైన్లు రూపొందించాలని సీఎం అదేశించారు. ఓఆర్ఆర్‌కు ఒక వైపున ఉండే ఎకో థీమ్ పార్క్. మరో వైపున నిర్మించే ఐకానిక్ టవర్‌కు చేరుకునేందుకు ప్రయాణా లకు వీలుగా ఎలివేటెడ్ గేట్ వే నిర్మించి దాన్ని 'గేట్ వే అఫ్ హైదరాబాద'గా డిజైన్ చేయాలని సూచించారు. బాపూఘాట్ చుట్టూ ఉన్న ఏరియాను వరల్డ్ క్లాస్‌జోన్‌గా అందరిని ఆకట్టుకునేలా డిజైన్ చేయాలని చెప్పారు. హిమాయత్‌సాగర్ దగ్గర అప్రోచ్ రోడ్డు నుంచి అత్తాపూర్‌వైపు వెళ్లేందుకు కొత్త ఫ్లైఓవర్ నిర్మించాలనీ, గాంధీ సరోవర్ చుట్టూ ఈ ఫ్లైఓవర్ కనెక్టివ్ కారిడార్‌లా ఉండాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఎయిర్‌పోర్ట్ నుంచి నేరుగా గాంధీ సరోవర్‌కు చేరుకునేలా ఈ కనెక్టివిటీ ఉండాలన్నారు. గాంధీ సరోవర్ వద్ద నిర్మించే ఐకానిక్ టవర్ పరిస్థితులను బట్టి ప్రపంచంలోనే అత్యంత ఎత్తుగా నిర్మించా లని చెప్పారు. తాగునీటితోపాటు వరదనీటి నిర్వహణకు వీలుగా మూసీ పునరుజ్జీవ ప్రాజెక్ట్ ఉండాలనీ, వివిధ దేశాల్లో అమల్లో ఉన్న ప్రాజెక్ట్ నమూనాలు పరిశీలించాలని సీఎం చెప్పారు. ఉస్మాన్‌సాగర్ హిమాయత్‌సాగర్ తాగునీటిని హైదరాబాద్ నగర అవసరాలు తీర్చేందుకు మరింత సమర్ధంగా వినియోగించు కునేలా ప్లానింగ్ చేయాలన్నారు. స్థలం వథా కాకుండా మూసీ పరివాహక ప్రాంతం ఇరు వైపులా అండర్‌గ్రౌండ్‌లో భారీగా వాటర్ స్టోరేజీ సంపు నిర్మించే సదుపాయాలు, అక్కడి నుంచి వాటర్ ట్రాన్స్‌పోర్ట్ జరిగేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. గాంధీసరోవర్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివద్ధి చేసే పనులకు వాటర్‌ఫ్లో స్టడీస్ పక్కాగా చేసుకోవాలని అధికారులను అప్రమత్తం చేశారు. రెండు నెలల్లో టెండర్లు పిలిచేందుకు వీలుగా పనుల వేగం పెంచాలని ముఖ్యమంత్రి అధికారులను అదేశించారు.

## ఆదివాసి సంస్కృతిని భావితరాలకు అందిద్దాం

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

### గిరిజన సంప్రదాయ సంప్రదాయ నృత్యాలతో స్వాగతం

4లో..



## రాహుల్ ప్రశ్నలకు యూపీ సీఈఓ పొంతనలేని సమాధానాలు



**న్యూఢిల్లీ/లక్నో :** కర్నాటక ఓటర్ల జాబితాలో చోటుచేసుకున్న అవకతవకలపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లేవనెత్తిన పలు ప్రశ్నలకు ఎన్నికల కమిషన్ నుంచి ఇప్పటికీ సరైన సమాధానాలు లభించలేదు. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో రాహుల్ ఓ అంశాన్ని లేవనెత్తారు. కర్నాటక ఓటర్ల జాబితాలో పేరున్న ఆదిత్య శ్రీవాత్సవ, విశాల్ సింగ్ వీరిద్దరికీ ఉత్తరప్రదేశ్ సహా ఇతర రాష్ట్రాలలో కూడా ఓటు హక్కు ఉన్నదని ఆయన ఆధారాలతో సహా చూపించారు. తన వాదనకు మద్దతుగా మార్చి 16న ఎన్నికల కమిషన్ వెబ్‌సైటు నుంచి తీసుకున్న స్క్రీన్‌షాట్లను చూపారు. ఒకే ఓటరు ఒకటి కంటే ఎక్కువ రాష్ట్రాల ఓటర్ల జాబితాలలో ఎలా ఉంటాడని ప్రశ్నించారు. రాహుల్ షేర్ చేసిన స్క్రీన్‌షాట్ ప్రకారం.. ఆదిత్య శ్రీవాత్సవ (ఓటర్ ఐడీ నెంబర్ : ఎఫ్‌పీపీ64370040)కు కర్నాటకలోని మహదేవ్‌పురా నియోజకవర్గంలో రెండు పోలింగ్ కేంద్రాల్లో ఓటు ఉంది. అంతేకాదు మహారాష్ట్రలోని జోగేశ్వరి ఈస్ట్‌లోనూ, ఉత్తరప్రదేశ్‌లోని లక్నో ఈస్ట్‌లోనూ ఆయనకు ఓటుంది. ఇక విశాల్ సింగ్ (ఎపిక్ నెంబర్ : ఐఎన్‌బీ2722288) విషయానికి వస్తే ఆయన పేరు కూడా మహదేవ్‌పురాలోని రెండు పోలింగ్ కేంద్రాల ఓటర్ల జాబితాలలో ఉంది. మిగతా 6లో..

## త్వరలో ఎఐ వర్శిటీ ఏర్పాటు



**టైమ్స్ ఆఫ్ వార్త – హైదరాబాద్ :**
ఈ యాప్సిస్ విస్తరణతో హైదరాబాద్ ప్రపంచ సాంకేతిక, ఇన్నోవేషన్ కేంద్రంగా ఉన్న స్థానం మరింత బలపడిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు అన్నారు. విస్తరించిన ఈ యాప్సిస్ గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్‌ను శనివారం హైదరాబాద్‌లో మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఒరాకిల్, ఏఐ, కొత్త సాంకేతిక పరిజ్ఞాన ఆధారిత మార్పుకు తోడ్పడుతూ ఈ యాప్సిస్‌హైదరాబాద్ వర్క్‌ఫోర్స్‌ను 500కి పైగా పెంచనుంది. సర్వీస్ ఆధారిత కంపెనీలను నడపడం తేలిక. కానీ ప్రొడక్ట్ ఆధారిత కంపెనీలు ఎక్కువ సవాళ్లు ఎదుర్కొంటాయి. హైదరాబాద్ టెక్ హబ్‌గా పెరుగుతున్న గుర్తింపు ప్రశంసనీయం అని, సాఫ్ట్‌వేర్ ప్రొడక్ట్ ఎగుమతుల్లో తెలంగాణను అగ్రస్థానంలో ఉంచేందుకు ప్రభు త్వం కట్టుబడి ఉందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. కంపెనీలు యూనికార్న్ స్థాయిని సాధించే లక్ష్యంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. గతంలో మూడు మాత్రమే ఉన్న యూనికార్న్‌లు ఇప్పుడు హైదరాబాద్‌లో 30–40 కి పెరిగాయని, 400 సీట్లు ఉన్న ఈ కొత్త కార్యాలయం సామర్థ్యం భవిష్యత్తులో 4–6 రెట్లు పెరిగి రాష్ట్రం, నగరానికి మరింత గుర్తింపును తెస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు ఆశాభావం వ్యక్తం చేశారు. యూకే ప్రధాన కేంద్రంగా ఉన్న ఈ గ్లోబల్ ఒరాకిల్ భాగస్వామి ఐటీ సేవల సంస్థ హైదరాబాద్‌లో ప్రస్తు తం ఉన్న 200 మంది సిబ్బందిని వచ్చే రెండు సం వత్సరాల్లో 500 మందికి పైగా పెంచాలని ప్రణాళికలు ప్రకటించింది. అత్యాధునిక 400 సీట్ల సామర్థ్యంతో కూడిన కొత్త సౌకర్యాన్ని గ్లోబల్ డెలివరీ సెంటర్‌లో జోడించడం ద్వారా హైదరాబాద్‌ను ఒరాకిల్ క్లౌడ్, ఈఆర్‌పి, ఏఐ, ంటర్‌ప్రైజ్ ట్రాన్స్‌ఫర్మేషన్ సర్వీసులకు వ్యూహాత్మక కేంద్రంగా మరింత బలపరిచింది. ఈ కొత్త సెంటర్ ద్వారా ఒరాకిల్ క్లౌడ్/ఈఆర్‌పి కన్సల్టెంట్లు, ఏఐ/ఎంఎల్ ఇంజనీర్లు, సొల్యూషన్ ఆర్కిటెక్టులు, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టులు వం టి వందలాది అధిక నైపుణ్యాల ఉద్యోగాలు సృష్టించబడతాయి.

TIMES OF VARTHA (10-08-2025)_times of varha main (13-2).qxd 8/10/2025 5:42 AM Page 2



## సోదర అనుబంధానికి ప్రతీక రక్షా బంధన్...



టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి

సోదర సోదరీమణుల మధ్య ప్రేమ, అనురాగం, ఆప్యాయతలను పెంచే పండుగగా రక్షా బంధన్‌ను ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలోని పౌర్ణమి రోజున జరుపుకుంటారు. ఈమేరకు ఎడపల్లి మండలంలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. సోదరీమణులు తమ సోదరుల క్షేమం కోరుతూ వారి చేతికి రాఖీలు కట్టగా, సోదరులు వారికి జీవితాంతం తోడుగా, రక్షణగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇళ్లన్నీ పండుగ వాతావరణంతో కళకళలాడాయి. వేడుకల్లో భాగంగా సోదరీమణులు తమ సోదరుల నుదుటిపై తిలకం దిద్ది వారి చేతి మణికట్టుకు రంగురంగుల రాఖీలను కట్టి, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. సోదరులు కూడా తమ సోదరీమణులకు ఆశీస్సులు అందిస్తూ బహుమతులు అందజేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, ఒకరికొకరు సంతోషాలను పంచుకున్నారు. రక్షా బంధన్ పండుగకు వేల సంవత్సరాల చరిత్ర ఉంది. పురాణాల ప్రకారం, కృతయుగంలో ఇంద్రుడు తన భార్య శచీదేవి చేత రాఖీ కట్టించుకుని యుద్ధంలో గెలిచినట్లు చెబుతారు. మహాభారతంలో ద్రౌపది శ్రీకృష్ణుడి వేలికి రక్తం కారుతుంటే తన చీర కొంగు చింపి కట్టు కట్టిందని, దానికి ప్రతిగా శ్రీకృష్ణుడు ఆమెకు రక్షణ కవచంగా ఉంటానని హామీ ఇచ్చాడని ప్రతీతి. ఈ పండుగ కేవలం సోదర, సోదరీమణులకే పరిమితం కాకుండా, రక్షణ కోరుకునే వారి మధ్య ప్రేమ, నమ్మకాన్ని సూచిస్తుంది. కాలం మారినా రక్షా బంధన్ ప్రాముఖ్యత ఏ మాత్రం తగ్గలేదు. ఇప్పుడు విదేశాల్లో ఉన్న సోదరులకు కూడా ఆన్‌లైన్‌లో రాఖీలు పంపిస్తున్నారు. వీడియో కాల్స్ ద్వారా ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకుంటూ, ఈ పండుగను జరుపుకుంటున్నారు. ఈ డిజిటల్ యుగంలో కూడా మానవ సంబంధాలకు, అనుబంధాలకు ఉన్న విలువను ఈ పండుగ చాటిచెబుతోంది.

# విస్తృత స్థాయిలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి

**జిపి ల నుంచి రాష్ట్ర సచివాలయం వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలలో సోలార్ యూనిట్ల ఏర్పాటు**

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి**

**మంత్రి లక్ష్మణ్ కుమార్ తో కలిసి కలెక్టర్లతో వీ.సీ ద్వారా సమీక్ష జరిపిన డిప్యూటీ సీఎం**

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ కలెక్టరేట్



గ్రామ పంచాయతీ భవనం నుంచి మొదలుకుని రాష్ట్ర సచివాలయం వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సూచించారు. రాష్ట్రంలో సోలార్ విద్యుత్ ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ విధానపరమైన నిర్ణయం తీసుకుందని ఆయన వెల్లడించారు. శనివారం ఆయన డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ సచివాలయం నుంచి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, ఎస్.పీ.డీ.సీ.ఎల్ సీఎండి ముషారఫ్, రెడ్కో సీఎండీ అనిలా తదితరులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు, ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో ఇందిరా సౌర గిరిజల వికాసం పథకం అమలు, ఇరిగేషన్, దేవాదాయ తదితర శాఖల పరిధిలోని ఖాళీ భూములలో, అవకాశం ఉన్న అన్ని చోట్ల సోలార్ విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అన్ని జిల్లాల సమీకృత కార్యాలయాల భవనాలపై, పార్కింగ్, క్యాంటీన్ ల వద్ద సోలార్ యూనిట్ల ఏర్పాటు కోసం ప్రణాళికలు రూపొందించి, ప్రభుత్వానికి పంపాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లు అన్నీ కూడా ఒకే నమూనాలో నిర్మించినందున సోలార్ పవర్ ప్లాంట్ ల ఏర్పాటుకు అనుకూలమైన డిజైన్లను హైదరాబాదు నుంచి ఎంపిక చేసి పంపిస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇప్పటికే కలెక్టర్ కార్యాలయాల్లో సోలార్ యూనిట్లకు సంబంధించిన మంచి డిజైన్లు ఉంటే, వాటిని పంపాలని సూచించారు. అన్ని కార్యాలయాల్లో సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన వివరాలకు సంబంధించి కలెక్టర్లు హైదరాబాద్ కు పంపాల్సిన వివరాలకు సంబంధించి నిర్ణీత ఫార్మాట్ పంపిస్తున్నామని, అందులో అన్ని వివరాలు నమోదు చేసి వారం రోజుల్లోపు విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కార్యాలయానికి పంపాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ప్రభుత్వ భవనాలతో పాటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, విశ్వ విద్యాలయాలు వంటి ఉన్నత విద్యా సంస్థల భవనాలపై కూడా సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేయాలని, అందుకు సంబంధించిన భవనాల వివరాలు పంపాలని కలెక్టర్లకు సూచించారు. నీటిపారుదల శాఖ, రోడ్లు భవనాల శాఖ పరిధిలో పెద్ద ఎత్తున ఖాళీ స్థలాలు ఉన్నాయని, వాటి వివరాలు సైతం పంపాలని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్ఓఎఫ్ఆర్ చట్టం కింద 6.70 లక్షల ఎకరాల భూములను ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేసిందని, ఈ భూముల్లో నల్లమల డిక్లరేషన్ కింద ఇందిరా సౌర గిరిజల వికాసం పథకం ద్వారా ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం కలెక్టర్లకు వివరించారు. నల్లమల డిక్లరేషన్ లో భాగంగా ఇప్పటికే అచ్చంపేట నియోజకవర్గంలో ప్రారంభించామని, ఈ నెలలోనే ఆదిలాబాద్ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ప్రారంభించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు. ఇందిరా సౌర గిరి జల వికాసం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని, దీనిని దృష్టిలో పెట్టుకొని జాప్యానికి తావు లేకుండా వారం రోజుల్లోపు వివరాలు పంపాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీఆర్డీఓ సాయాగౌడ్, టీజీ రెడ్కో డీ.ఎం రమణ, ట్రాన్స్కో ఎస్.ఈ రవీందర్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు భీమాకు దరఖాస్తు చేసుకోండి..

## ఏవో సిద్ధిరామేశ్వర్

టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి



కొత్తగా పట్టా పాస్‌బుక్ పొందిన రైతులకు రైతు భీమా పథకంలో చేరడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీనికి దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ ఆగస్టు12 అని ఎడపల్లి మండల వ్యవసాయ అధికారి సిద్ధిరామేశ్వర్ తెలియజేశారు. రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డుతో పాటు పూర్తిగా నింపిన దరఖాస్తు ఫారాన్ని తమ క్లస్టర్లలోని అధికారులకు అందజేయాలని ఆయన సూచించారు రైతు భీమాలో ఇదివరకే ఉన్నవారు, నామినీని మార్చాలన్నా లేదా ఇతర వివరాలు సవరించాలన్నా ఆగస్టు 12లోపు తమ రైతు వేదికలలో సంప్రదించవచ్చని, ఇలా చేయడం వల్ల రైతు భీమాకు సంబంధించిన వివరాలు సరిగ్గా నమోదవుతాయని ఏవో సిద్ధిరామేశ్వర్ తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, గడువులోపు దరఖాస్తులు లేదా మార్పులు చేసుకోవాలని ఆయన కోరారు. మరింత సమాచారం కోసం రైతులు తమ క్లస్టర్ అధికారిని లేదా రైతు వేదికను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

## వాస్తవ లాభాలు ప్రకటించి, కార్మికులకు లాభాల వాటా చెల్లించాలి

**లాభాలు ప్రకటించకుంటే ఐక్య పోరాటాలకు సిద్ధం**

టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-



గత ఆర్థిక సంవత్సరం 2024-25 గడిచి నాలుగు నెలలు గడిచిన సింగరేణి యాజమాన్యం ఇప్పటికీ సింగరేణికి వచ్చినా లాభాలను కనీసం ప్రకటించకపోవడం సరికాదని, వెంటనే సింగరేణికి వచ్చిన వాస్తవ లాభాలను ప్రకటించి, అందులో నుండి కార్మికులకు 35 శాతం లాభాల వాటా చెల్లించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) శ్రీరాంపూర్ బ్రాంచ్ ఐకే 1ఏ గని పిట్ కార్యదర్శి సిరుకొండ శ్రీనివాస్ తెలిపారు. సింగరేణికి వచ్చిన లాభాలు వెంటనే తెలియజేయాలని డిమాండ్ చేస్తూ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లాలోని శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే 1ఏ గనిపై యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులచే సంతకాల సేకరణ నిర్వహించి, అనంతరం సింగరేణి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, గత ఆర్థిక సంవత్సరం లాభాలను ప్రస్తావిస్తూ సింగరేణి సిఎండి ఒక ప్రకటనలో సుమారు 5 వేల కోట్ల పైచీలుకు లాభాలు వచ్చాయని, ఆడిట్ అనంతరం పూర్తి లాభాలు తెలుపుతామని తెలుపగా, ఆర్థిక సంవత్సరం గడిచి ఇప్పటికీ నాలుగు నెలలు అవుతున్న యాజమాన్యం నేటికీ లాభాలు ప్రకటించలేదని ఆరోపించారు. ప్రభుత్వం మారినా, గుర్తింపు సంఘం మారినా, లాభాల ప్రకటన తీరు మారడం లేదన్నారు. సింగరేణి సంస్థకు ఎన్ని లాభాలు వచ్చాయో చెప్పకుండా యాజమాన్యం మీనమేషాలు లెక్కించడంపై కార్మికులు ఇప్పటికే అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. సింగరేణి యాజమాన్యం వెంటనే సింగరేణికి వచ్చిన లాభం ప్రకటించకపోతే అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని, ఐక్య పోరాటాలకు పిలుపునిచ్చి, ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. గత ఆర్థిక సంవత్సరమే ఆలస్యం చేసి, సగం లాభాలు పక్కకు పెట్టడం వల్ల కార్మికులు నిరాశతో ఉన్నారని, మళ్ళీ అలాంటి పనులు చేయకుండా, సింగరేణికి వచ్చిన వాస్తవ లాభాలు ప్రకటించి, అందులో నుండి 35 శాతం లాభాల వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గత ఆర్థిక సంవత్సరం పక్కకు పెట్టిన డబ్బులతో ఎంత మేరకు అభివృద్ధి చేశారో కార్మికులకు తెలిపాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, వెంకట్ రెడ్డి, ఖాదీర్ పాషా, వినయ్, మొయినుద్దీన్, శ్రీనాథ్ లు పాల్గొన్నారు.

## విద్వేషం, అవినీతి, అన్యాయాలపై పోరాడుదాం

**యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విపుల్ గౌడ్**

**ఘనంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ జిల్లా ప్రతినిధి



యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్ గౌడ్ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం వద్ద జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బీన్ హందాన్, నూడ చైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరాల రత్నాకర్ హాజరయ్యారు. యువజన కాంగ్రెస్ 65వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విపుల్ గౌడ్ యూత్ కాంగ్రెస్ జెండా ఎగరవేశారు. అనంతరం విపుల్ గౌడ్ మాట్లాడుతూ జాతీయ యువజన కాంగ్రెస్ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఆధ్వర్యంలో 1966లో స్థాపించబడిందని, అప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీలో, జాతీయ రాజకీయాల్లో యూత్ కాంగ్రెస్ క్రియాశీలక పాత్ర పోషించిందని దాని తర్వాత ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన రాజీవ్ గాంధీ నాయకత్వంలో యూత్ కాంగ్రెస్ మరింత బలంగా మారి యువతకు రాజకీయ వేదికగా మారిందని ఆయన అన్నారు. యూత్ కాంగ్రెస్ అతిపెద్ద ప్రజాస్వామ్య యువజన సంఘం అని, యూత్ కాంగ్రెస్ అనేకమంది సమర్థవంతమైన క్రమశిక్షణ కలిగిన జాతీయ, రాష్ట్ర నాయకులను తయారుచేసిందని, యూత్ కాంగ్రెస్ తయారుచేసిన నాయకులు భారతదేశం అభివృద్ధికి బాటలు వేశారని యూత్ కాంగ్రెస్ అంటే క్రమశిక్షణకు పోరాటానికి త్యాగానికి మారుపేరని ఆయన అన్నారు. గత 65 సంవత్సరాల నుంచి కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు యూత్ కాంగ్రెస్ అనేక సేవా కార్యక్రమాలు చేయడమే కాకుండా యువతకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా పని చేసిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనప్పుడు ప్రతిపక్ష పార్టీగా ఉన్నప్పుడు అధికార పక్షంపై ఎన్నో పోరాటాలు చేసి యువతకు, నిరుద్యోగులకు న్యాయం చేకూరేలా అనేక ఉద్యమాలు చేపట్టిందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా 2014 నుంచి మోదీ ప్రభుత్వంలో భారతదేశం చాలా సమస్యలు ఎదుర్కొంటుందని, వాటన్నింటిని యూత్ కాంగ్రెస్ రాహుల్ గాంధీ నాయకత్వంలో ముందుండి దేశ ప్రయోజనాల అనునిత్యం పోరాటం చేస్తూనే ఉంటుందని, మత తత్వ విద్వేష బీజేపీని కేంద్రంలో గద్దె దించి రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే యూత్ కాంగ్రెస్ యొక్క లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. యూత్ కాంగ్రెస్ లో పనిచేయడానికి యువ గొంతులు మాతో కలిసి రావాలని, అన్యాయం, అవినీతి, విద్వేషానికి వ్యతిరేకంగా ఐక్యంగా నిలబడాలని, మనమందరం కలిసి యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మెరుగైన భారతదేశం కోసం పోరాటం చేద్దామని, ప్రతి ఒక్కరికీ ఒక ప్రకాశవంతమైన భవిష్యత్తును అందిద్దామని ఆయన యువతను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామ్మూర్తి గోపి, జెండా బాలాజీ ఆలయ చైర్మన్ లవంగం ప్రమోద్ ,యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షు లు అనుపాల్ కిరణ్, ఎండి అద్నాన్, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆదిత్య పాటిల్, నరేందర్ గౌడ్, ఇర్ఫాన్, యూత్ కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మోయిన్, కల్పోలు వంశీ, దినేష్, నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-



పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం బి 1 క్వార్టర్ నందు శనివారం యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ 65వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టి, వేడుకలు నిర్వహించారు. అనంతరం యువజన నాయకులు రాయబారపు కిరణ్, జావీద్ ఖాన్, చిప్పకుర్తి శశిధర్ ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ చెన్నూరు నియోజవర్గ ప్రధాన కార్యదర్శి నేరటి వెంకటేష్, మండల ప్రధాన కార్యదర్శి బియ్యపు రవికిరణ్ లను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం రాయబారపు కిరణ్ మాట్లాడుతూ, ఆగస్టు 9, 1960న ఆవిర్భవించిన యువజన కాంగ్రెస్ ఆనాటి నుండి నేటి వరకు యువజన నాయకులు రాజకీయాల్లో గాని, సమాజంలో గాని తమ వంతు పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాల్లో చేయూతనందిస్తూ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర రాజకీయాల సైతం యువజన కాంగ్రెస్ పాత్ర ఎంతో ఉందని తెలిపారు. యువజన కాంగ్రెస్ చెన్నూరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నేరటి వెంకటేష్ మాట్లాడుతూ, ముందుగా అందరికీ యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ ఎంతో కీలకపాత్ర పోషించిందని, స్థానిక ఎంపీ, యువ నాయకుడు గడ్డం వంశీకృష్ణ విజయంలో యువజన కాంగ్రెస్ పాత్ర ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో సైతం యువజన కాంగ్రెస్ నాయకులు ముందుండి పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు ఒజ్జ గణేష్, సురేందర్, తౌసిఫ్, సాయి, కిరణ్, మహేష్, సతీష్, చింటూ, సాజన్, తరుణ్, వేణు, రాజేష్, వెంకటేష్,యాసిన్, మణిదీప్, విజయ్, సోహెల్, బన్నీ లు పాల్గొన్నారు.

# డిచ్పల్లి సీ.హెచ్.సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

**తహసీల్దార్ కార్యాలయం సందర్శన**

టైమ్స్ అఫ్ వార్త - నిజామాబాద్ జిల్లా ప్రతినిధి



ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నమ్మకాన్ని పెంపొందించాలని కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. శనివారం ఆయన డిచ్పల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిసెప్షన్ సెంటర్, ఇన్ పేషంట్, ఫిమేల్, జనరల్ వార్డులు, ల్యాబ్ తదితర విభాగాల పనితీరు పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బంది గురించి ఆరా తీసిన కలెక్టర్ అటెండెన్స్ రిజిస్టర్ తనిఖీ చేశారు. ప్రతి రోజు ఎంత మంది పేషంట్లు వస్తున్నారు, స్థానికంగానే కాన్పులు చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలు జరిగేలా కృషి చేయాలని వైద్యులకు సూచించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేలా అంకిత భావంతో పని చేయాలని హితవు పలికారు. రౌండ్ ది క్లాక్ ఆసుపత్రులలో అన్ని సమయాలలో వైద్యులు, సిబ్బంది విధుల్లో ఉండాలని ఆదేశించారు. ప్రతీ నెల రెండవ శనివారం ప్రత్యేకంగా నిర్వహించే ఆరోగ్యశ్రీ శిబిరానికి అన్ని విభాగాల స్పెషలిస్టు డాక్టర్లు హాజరయ్యేలా చూడాలని, పీ హెచ్ సీ లు, సీ హెచ్ సీల పనితీరును ప్రతి రోజు పర్యవేక్షణ చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ డిచ్పల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యల గురించి తహసీల్దార్ సతీష్ రెడ్డిని ఆరా తీశారు. త్వరితగతిన అర్జీలు పరిష్కరించాలని సూచించారు.

since 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
ఆదివారం,
10-08-2025


# అనుబంధాలకు ప్రతీకగా రక్షాబంధన్ వేడుకలు

టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

పవిత్రమైన అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతీకగా నిర్వహించు పండుగ రక్షా బంధన్, తోబుట్టువులకు పవిత్రమైన పండుగ. శనివారం రక్షాబంధన్ పండుగను పట్టణం, మండలంలో ప్రజలు ఎంతో అనురాగ, ఆప్యాయతలు నడుమ నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా సోదరీమణులు తమ సోదరునికి రక్ష (రాఖీ)ని కట్టి తమ అనుబంధాన్ని చాటారు. ప్రతి కష్టంలో సోదరులు తోడుంటారనే విశ్వాసానికి గుర్తుగా ప్రతి ఏటా శ్రావణ పౌర్ణమి రోజున రక్షాబంధన్ (రాఖీ పండుగ) సోదరీ సోదరీమణులు ఎంతో ఘనంగా నిర్వహించుకుంటారు. సోదర, సోదరీమణుల మధ్య అనుబంధాన్ని ఈ పండుగ గుర్తు చేస్తుంది. రాఖీ అంటే రక్షణ అని, సోదరి తన సోదరుడికి రాఖీ కట్టి, జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవాలని ఎల్లవేళలా అండగా, రక్షణగా ఉండాలని ఆకాంక్షిస్తూ సోదరుని చేతికి రాఖీని కడతారు.



## మార్కెట్లో పండుగ శోభ...

రాఖీ పండుగ నేపథ్యంలో నగరంలోని తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రాఖీల విక్రయ దుకాణాల్లో రకరకాల రాఖీల విక్రయాలతో జోరందుకున్నాయి. గత మూడు రోజులుగా స్టాల్స్ పెట్టి, రాఖీలు విక్రమిస్తున్నారు. మార్కెట్లో వివిధ ధరల్లో పలు రకాల రాఖీలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. శ్రావణ శుక్రవారం, రెండో శనివారం కలిసిరావడం, పాఠశాలలు, కళాశాలలకు వరుసగా మూడు రోజులు సెలవు కావడంతో నగరంలో మార్కెట్ కూడళ్లు కిక్కిరిసి పోయాయి. దీంతో పట్టణంలో పండుగ శోభ సంతరించుకుంది.

# భీమారం ఐటిడిప ఉద్యాన నర్సరీలో చెట్ల బహిరంగ వేలం

## ఐటీడీఏ ఉట్నూరు ప్రాజెక్ట్ అధికారిని ఖుష్బూ గుప్తా

టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-



జిల్లాలోని భీమారం ఐటిడిఏ ఉద్యాన నర్సరీలోని వివిధ రకాల చెట్లను బహిరంగ వేలం వేస్తున్నామని ఐటిడిఏ ఉట్నూర్ ప్రాజెక్ట్ అధికారిని ఖుష్బూ గుప్తా శనివారం ప్రకటనలో తెలిపారు. నర్సరీని బలోపేతం చేయటానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, దీనిలో భాగంగా మామిడి, సపోటా చెట్ల ను ఒక మీటర్ ఎత్తులో నరికి మళ్ళీ అంట్లు కట్టనున్నామన్నారు. మామిడి, సపోటా చెట్ల తో పాటు వెదురు, సరుగుడు, దుర్సినం, అశోక, తుమ్మ, ఆయిల్ పామ్, వేప, చింత, నేరేడు, ఉసిరి మొదలైన చెట్లు ఉన్నాయని, వీటిని నరికి మొద్దులను తీస్కొని పోవటానికి ఆగష్టు 13న భీమారం ఉద్యాన నర్సరీ లో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల రైతులు, వ్యాపారస్తులు, వ్యక్తులు ఆగష్టు 13న వెనక్కి తిరిగి చెల్లించని 3వేల రూపాయల దారావత్తు సొమ్ము కట్టి, వేలం లో పాల్గొనాలని సూచించారు. మరిన్ని వివరాలకు భీమారం ఉద్యాన నర్సరీ సాంకేతిక అధికారి బి రాజేంద్ర ప్రసాద్, సెల్ నెంబర్ 9703333111లో సంప్రదించగలరని తెలిపారు.

# ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు...

టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి



ఎడపల్లి మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోధన్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కార్తీక్ యాదవ్ హాజరై యూత్ కాంగ్రెస్ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా కార్తీక్ యాదవ్ మాట్లాడుతూ...యూత్ కాంగ్రెస్ నాయకులుగా ఎదగడానికి మంచి వేదిక అని అన్నారు... యువజన కాంగ్రెస్ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ తరపున తమ అభ్యర్థి గెలుపు కొరకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎడపల్లి మండల అధ్యక్షులు రంజిత్ ఔదారి,అసెంబ్లీ ఉపాధ్యక్షులు నవీన్, కేసిసి నియోజవర్గ అధ్యక్షులు సరిదాస్,జిల్లా యూత్ కాంగ్రెస్ ఇన్చార్జి శ్రీకాంత్ అబ్బోల్ల,రెంజల్ మండల అధ్యక్షులు గైని కిరణ్, మండల ఉపాధ్యక్షులు కన్న రాజశేఖర్, కుమార్, రెంజల్ మండల యూత్ కాంగ్రెస్ నాయకులు శంశోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# సౌర విద్యుత్ ఉత్పాదకత దిశగా ప్రభుత్వం అడుగులు

## రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-



రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పాదకత దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి (ఎనర్జీ) నవీన్ మిట్టల్, రెడ్ కో సిఎండి, ఎస్పిడిసిఎల్ సిఎండి, సింగరేణి కాలరీస్ సిఎండి ఎన్ బలరాం లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సోలార్ సిస్టం ఇన్స్టాలేషన్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా సౌర విద్యుత్ ఉత్పాదకత దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇందు కొరకు రాష్ట్రంలోని ప్రభుత్వ భవనాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు, ఆర్ఓఎఫ్ఆర్ భూముల వివరాలతో నిర్ణీత నమూనా ప్రకారం నివేదిక రూపొందించి వారం రోజులలోగా సమర్పించాలని తెలిపారు. జిల్లాలలో గల ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల భవనాల రూఫ్ టాప్ పై సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ వహించి, అన్ని జిల్లాల కలెక్టర్లు వారంలోగా సంబంధిత వివరాలను ఎనర్జీ డిపార్ట్మెంట్ కు పంపించాలని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాలలోని 6 లక్షల 17వేల ఎకరాలలో సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఈ క్రమంలో 3 సంవత్సరాల లోపు ప్రక్రియ పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లాలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఖాళీ ప్రభుత్వ స్థలాల వివరాలను నిర్ణీత నమూనాలో అందించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# చామర్తి నాగేశ్వరావు పార్థివ దేహానికి నివాళులు

## అర్పించిన తెదేపా మండల అధ్యక్షులు రావుట్ల సత్యనారాయణ.

టైమ్స్ ఆఫ్ వార్త - బోనకల్



మండల పరిధిలోని చోప్పకట్లపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త చామర్తి నాగేశ్వరరావు (55)శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడికి భార్య ఒక కుమారుడు కుమార్తె ఉన్నారు. తెలుగుదేశం మండల అధ్యక్షులు రావుట్ల సత్యనారాయణ, స్థానిక నాయకులతో కలిసి పార్థివదేహాన్ని సందర్శించి, పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. వారి కుటుంబానికి సంతాప సానుభూతి తెలియజేశారు. నాగేశ్వరావు మృతి పార్టీకి తీరని లోటని, వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. నివాళులర్పించిన వారిలో జిల్లా తెలుగు యువత నాయకులు మైనేని రవికుమార్,మండల కార్యనిర్వాహక కార్యదర్శి మండేపూడి మోహనరావు, టి.ఎన్ టి. యు. సి మండల అధ్యక్షుడు మండేపూడి గోర్కె, గ్రామ శాఖ అధ్యక్షుడు ఏసుపోగు నాగేశ్వరరావు, వివిధ హెూదాలో ఉన్న నాయకులు. సంగపు. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లిలో భారీ వర్షానికి కూలిన ఇల్లు

## నిరాశ్రయులైన కుటుంబం.. ఆదుకోవాలని వేడుకోలు

టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-





జిల్లాలోని బ్లెంపల్లి పట్టణంలోని కాల్ టెక్స్ ఏరియా 12వ వార్డు రోడ్ నెంబర్- 7లో గత కొన్ని సంవత్సరాల నుండి నివసిస్తున్నటువంటి బొద్దున సతీష్ తండ్రి బోద్దున శంకర్ కుటుంబం ఉంటున్న గూణ పెంకుటిల్లు ఇంటి గోడ శనివారం కురిసిన భారీ వర్షానికి కూలిపోయింది. ఎటువంటి నిలువ నీడ లేని పరిస్థితిలో వారి కుటుంబ సభ్యులు నిస్సహాయ స్థితిలో ఆదుకోవాలని ప్రజా ప్రతినిధులను అధికారులను వేడుకున్నారు. వర్షానికి కూలిపోయిన ఇంటిని బెల్లంపల్లి మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ నెల్లి శ్రీలత లు సందర్శించి బెల్లంపల్లి తహశీల్దార్ కు సమాచారం అందించారు. స్పందించిన తహశీల్దార్ తన సిబ్బందిని పంపించి సోమవారం పంచినామా చేయిస్తామని తెలిపారు. ఈసందర్భంగా బాధితులు మాట్లాడాతూ, ఎటువంటి ఆదాయం లేని పరిస్థితుల్లో ఉన్నామని, కొన్ని సంవత్సరముల నుండి ఆటో డ్రైవర్ గా జీవనోపాధి చేసుకుంటూ, బ్రతుకుతున్న సమయంలో ఇలాంటి దుర్ఘటన జరిగిందని తమ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి తమను ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వం తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలన్నారు.

# గాంధారి మండలంలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

టైమ్స్ ఆఫ్ వార్త-గాంధారి



గాంధారి మండలంతో పాటు పరిసర అన్ని గ్రామాల్లో శనివారం రాఖీ పౌర్ణమి పండుగను ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ పండుగ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న బంధానికి ప్రతీకగా నిలుస్తుంది. తెల్లవారుజాము నుంచే పండుగ వాతావరణం నెలకొనగా, మహిళలు, బాలికలు తమ సోదరుల మణికట్టుకు రాఖీలు కట్టి, వారి సంతోషం కోసం ప్రార్థనల ం చేశారు. సోదరులు కూడా తమ సోదరీమణులకు చీరలు, బంగారు ఆభరణాలు, స్వీట్లు వంటి బహుమతులు ఇచ్చి, వారికి ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని మాటిచ్చారు. కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ, ఐక్యతను ఈ పండుగ మరింత పెంచింది. ఈ సందర్భంగా మార్కెట్లు, స్వీట్ దుకాణాలు రద్దీగా కనిపించాయి. పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించారు.

# ప్రపంచ ఆదివాసి దినోత్సం.. జెండా ఆవిష్కరణ..



టైమ్స్ ఆఫ్ వార్త - మాక్లూర్

ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకొని మాక్లూర్ మండలం మానిక్ బండార్ గ్రామంలో నాయకపోడ్ ఆదివాసి మండల ప్రధానకార్యదర్శి,మాజీ మండల అధ్యక్షులు ఆకుల రవి శనివారం జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు ఆదివాసుల హక్కులని కాలరాస్తున్నాయని, ఆదివాసీ నాయకపోడ్ హక్కులకోసం పోరాడుతానని అన్నారు. కార్యక్రమంలో మానిక్ బండార్ నాయక్ పోడ్ కులపెద్దలు సుంకరి అనీల్, రాససాయిలు, సుంకరిశ్రీను,చేపూర్ బాలయ్య, ఎర్రోళ్ల లక్ష్మణ్, ఆకుల లక్ష్మన్,గోనేటి లింగం తదితరులు పాల్గొన్నారు.

# గోడ గడియారాలు పంపిణీ

టైమ్స్ ఆఫ్ వార్త చింతకాని



చింతకాని మండలం పందిళ్ళ పల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు భట్టి విక్రమార్క ఫోటో ముద్రించిన గోడ గడియారాలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంబటి వెంకటేశ్వర్లు,జోనల్ ఇన్చార్జి బందెల నాగార్జున. ఆధ్వర్యంలో పందిళ్ళ పల్లి గ్రామంలో గోడ గడియారాలు పంపిణీ చేయటం జరిగినది. కార్యక్రమానికి గ్రామ శాఖ అధ్యక్షుడు అన్నం ప్రభాకర్ రెడ్డి,నాగసూరారెడ్డి, పనుముల సైదా రెడ్డి, బ్రహ్మారెడ్డి,అలవాల జనార్దన్, కిలారు నర్సారెడ్డి,వాక వీరారెడ్డి, వెంకటేశ్వర్లు, దేవరపల్లి రవీందర్ రెడ్డి. చర్ల వెంకటేశ్వర్లు,మండే కృష్ణయ్య, మండే శ్రీనివాసరావు, మేకల తిరుపతి, మండే బాబు,చెట్ల నర్సారెడ్డి, మండే సౌజన్య, వెంకట్రామారెడ్డి,మల్లెల శ్రీను, కిలారు పుల్లారెడ్డి. పాల్గొన్నారు.

# ప్రయాణికులకు రైల్వే 'రౌండ్ ట్రిప్' రాయితీ

పండగల వేళ ప్రయాణికులకు రైల్వే ఆఫర్ ప్రకటించింది. 'రౌండ్ ట్రిప్' పేరుతో కొత్త పథకాన్ని తీసుకొచ్చింది. దీని ద్వారా ప్రయాణ ఖర్చులో ప్రయాణికులకు కొంత మేరకు తగ్గించాలని నిర్ణయించింది. అయితే రిటర్న్ జర్నీ చేసినప్పుడే ప్రయాణికులకు అది వర్తిస్తుంది. రిటర్న్ టికెట్ బుక్ చేసుకుంటే 20శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తాజాగా ప్రకటించింది. దీని ద్వారా పండగల సమయంలో ముందస్తు టికెట్ను బుకింగ్ను ప్రోత్సహించినట్లు అవుతుంది. తద్వారా రైల్వేపై ఒత్తిడి కూడా తగ్గనుంది. ఆగస్టు 14 నుంచి బుకింగ్లు ప్రారంభిస్తున్నట్లు, అక్టోబర్ 13 నుంచి 26 నడుమ జరిపే ప్రయాణాలకు ఇది వర్తిస్తుందని రైల్వే వెల్లడించింది. దీనిని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించింది.



since: 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
ఆదివారం,
10-08-2025
4

# ఆదివాసి సంస్కృతిని భావితరాలకు అందిద్దాం

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-**



ఆదివాసీల సంస్కృతి సాంప్రదాయాలు ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయని, ఎంతో గొప్పతనం కలిగిన సంస్కృతిని కాపాడి, భావితరాలకు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని వైశ్య భవన్ లో ఏర్పాటు చేసిన ఆదివాసీ దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ను ఆదివాసి సంఘాల నాయకులు గిరిజన సంప్రదాయ సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. ఆదివాసి, గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. గిరిజనులకు విద్య, వైద్యం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని, గిరిజన ప్రాంతాలలో ప్రభుత్వం పాఠశాలలను అభివృద్ధి చేసి సకల సదుపాయాలు కల్పించి గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించడం జరుగుతుందని, గిరిజన యువత పిల్లలు పాఠశాలలకు క్రమం తప్పకుండా వచ్చేలా అవగాహన కల్పించాలని తెలిపారు. గిరిజన ప్రాంతాలలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, గిరిజన మహిళలు, పిల్లల సంక్షేమం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందన్నారు. గిరిజన ప్రాంతాలకు రహదారుల సౌకర్యం కల్పించి ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని తెలిపారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజనులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు అందరిని అలరించాయి. అదేవిధంగా శనివారం రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకొని బాలికలు జిల్లా కలెక్టర్ కు రాఖీ కట్టి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ఆదివాసి సంఘాల ప్రతినిధులు, పాల్గొన్నారు.

# ఆగస్టు 11లోపు కేయూ ఓపెన్ పీజీ, డిగ్రీ కోసం దరఖాస్తు చేసుకోండి

**బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కాంపల్లి శంకర్**

**టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-**



జిల్లాలోని బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో గల కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్య (ఎస్డిఎల్సిఈ) పిజి, డిగ్రీ కోర్సులలో ప్రవేశానికి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ప్రాతిపదికన దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కాంపల్లి శంకర్ శనివారం ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరం 2025-26 లో పీజీ, డిగ్రీ చేసేందుకుగాను ఆగస్టు 11 లోగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓపెన్ పీజీలో ఎంఏలో అన్ని సబ్జెక్టులలో, ఎంకామ్ చదివేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా ఓపెన్ డిగ్రీలో బిఏ, బీకాం, బీఎస్సీ అన్ని కోర్సులలో అడ్మిషన్లు ఉన్నాయన్నారు. దూరవిద్య ద్వారా పీజీ లేదా డిగ్రీ చేయాలనుకునేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీజీ చేసేందుకు స్టడీ సెంటర్ కోడ్ నెంబర్-770 ద్వారా, డిగ్రీ చదివేందుకు స్టడీ సెంటర్ కోడ్ నెంబర్-043 ద్వారా ఆన్లైన్ లో www.sdlceku.co.in వెబ్సైట్లో దరఖాస్తు చేసుకొని, ప్రింట్ అవుట్ కు సంబంధిత సర్టిఫికెట్లు జతచేసి, 2 సెట్లు బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో గల కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్య స్టడీ సెంటర్లో అడ్మిషన్ అప్లికేషన్ ఫామ్స్ నింపి అందజేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 9959269975 లో సంప్రదించాలని సూచించారు.

# గౌరారంలో ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం

**టైమ్స్ ఆఫ్ వార్త - గాంధారి**



గాంధారి మండలంలోని గౌరారంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా గిరిజన సంస్కృతి, ఐక్యతను చాటిచెప్పేలా అనేక కార్యక్రమాలు జరిగాయి. వేడుకల ప్రారంభంలో సాంప్రదాయ గిరిజన నృత్యాలు, పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ ఉత్సవాల్లో జిల్లా బాడీ మెంబర్ నరేష్, గాంధారి మండల ఆదివాసి అధ్యక్షుడు శేఖర్, గ్రామ అధ్యక్షులు చిన్న రాములు, పెద్ద రాములు తమ సందేశాలను ఇచ్చారు. గిరిజనుల హక్కులు, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతపై నాయకులు ప్రసంగాలు చేశారు. "ఐక్యతతోనే మన హక్కులను సాధించుకోగలం," అని నరేష్ పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో గ్రామస్థులు, నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

# రైతు బీమా అప్లికేషన్లకు దరఖాస్తులు స్వీకరణ

**ఆదివారం కూడా దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడి : ఏఈఓ శిరీష**

**టైమ్స్ ఆఫ్ వార్త - మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి**



కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకం పొంది భూభారతి పోర్టల్లో డిజిటల్ సైన్ చేసుకొని పట్టాలు పొందిన 18 నుంచి 59 ఏళ్ల వయసు ఉన్న రైతులు రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ శిరీష శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతు పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్, నామిని ఆధార్ కార్డు జిరాక్స్, రైతు బీమా దరఖాస్తు ఫారం దరఖాస్తులను రైతు స్వయంగా వచ్చి 12, 08, 2025 తేదీలోగా చిన్న గూడూరు మండలంలోని అందుబాటులో ఉన్న రైతు వేదికల్లో అమజేయాలని సూచించారు. అంతేకాకుండా నేడు ఆదివారం అయినా దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఇంతక ముందు నమోదు చేసుకున్న రైతులు ఏమైనా సవరణ ఉంటే సరిచేసుకోవాలని ప్రమాదవశాత్తు నామిని చనిపోయిన కొత్త నామినేని మార్పు కోసం వ్యవసాయ విస్తీర్ణ అధికారి వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకం నుండి ఇంతకుముందు నమోదు చేసుకుని రైతులకు కూడా పూర్తి వివరాలతో సంబంధిత రైతు వేదికల్లో సంప్రదించాలని ఏఈఓ శిరీష రైతులను కోరారు.

# కులం మతాలకతీతంగా జరుపుకునే గొప్ప పండుగ రాఖీ

**ఏరియా జిఎం జి దేవేందర్**

**జిఎం కు రాఖీ కట్టిన మహిళ ఉద్యోగినీలు**

**టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-**



కులం మతాలకు అతీతంగా జరుపుకునే గొప్ప పండుగ రాఖీ పండగ అని ఏరియా జిఎం జి దేవేందర్ తెలిపారు. రక్షాబంధన్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం ఏరియా జిఎం కార్యాలయంలో విధులు నిర్వహించే మహిళ ఉద్యోగినీలు ఏరియా జిఎం జి దేవేందర్ కు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా జిఎం జి దేవేందర్ మాట్లాడుతూ, ముందుగా మహిళా ఉద్యోగుల ందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. శ్రావణమాసం వచ్చే పౌర్ణమి రోజున రాఖీ పండుగ జరుపుకుంటారని, అన్నాచెల్లెళ్లు, అక్క తమ్ముళ్ల మధ్య వెలకట్టలేని బంధాలు, అనుబంధాలను గుర్తుగా చేసుకునే మధురమైన పండుగ రాఖీ పండుగ అని తెలిపారు. అమ్మలోని ఆప్యాయత, నాన్నలోని బాధ్యతలు తీసుకునే అన్న జీవితాంతం సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకుంటూ సోదరీమణి, తన సోదరుడి మణికట్టుకు కట్టే రక్షే రాఖీ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జిఎం విజయ్ ప్రసాద్, సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, కేకే గ్రూప్ ఏజెంట్ రాంబాబు, సివిల్ ఎస్ఈ రాము, ఏఐటీయూసీ స్ట్రక్చరల్ కమిటీ సభ్యుడు సివి రమణ, జిఎం కార్యాలయం ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి గీతిక, జి ఎం కార్యాలయ మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

# గిరిజన హక్కుల కోసం ఐక్య పోరాటం చేయాలని

**తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ప్రకాష్ నాయక్ పిలుపు..**

**టైమ్స్ ఆఫ్ వార్త - గాంధారి**



గాంధారి మండల కేంద్రంలో తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ గిరిజన దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించారు. గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ప్రకాష్ నాయక్ ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ, గిరిజన హక్కులను సాధించుకోవడానికి గిరిజనులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనుల హక్కులను కాలరాస్తున్నాయని ప్రకాష్ నాయక్ ఆరోపించారు. అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయడంలో ఈ ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. అదానీ, అంబానీ వంటి వారికి భూములను కట్టబెట్టే కుట్రలో భాగంగా గిరిజనులను అడవుల నుంచి వెళ్లగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని, పులుల పేరుతో గిరిజనుల గ్రామాలు ఖాళీ చేయిస్తున్నారని ఆయన తెలిపారు. కామారెడ్డి చుట్టుపక్కల వేల ఎకరాల ప్రభుత్వ భూములు దొరల చేతుల్లోకి వెళ్లాయని, వాటిని తిరిగి పొందడానికి గిరిజనులంతా ఐక్యంగా పోరాడాలని ప్రకాష్ నాయక్ పిలుపునిచ్చారు. రాబోయే సంవత్సరం మొత్తం పోరాటాలకు సిద్ధం కావాలని, భూమి కోసం చేసే పోరాటంలో కూలీలు, పేదలందరూ భాగం కావాలని ఆయన కోరారు. తమ హక్కుల కోసం నిరంతరం పోరాటం చేయాలని గిరిజన సంఘం రాష్ట్రవ్యాప్తంగా పిలుపునిచ్చిందని ప్రకాష్ నాయక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాయిరాం నాయక్, బలరాం నాయక్, సౌమ్యా నాయక్, శంకర్ నాయక్, సంతోష్ నాయక్, వసంత్ నాయక్, కిషన్ నాయక్, గణేష్ నాయక్ తదితర గిరిజన నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా యూత్ కాంగ్రెస్ 65వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:**

యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బాన్సువాడ నియోజకవర్గం లోని ఉమ్మడి కోటగిరి, పోతంగల్ మండలాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ చాంద్ పాషా , ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఉమ్మడి కోటగిరి మండలాల మాజీ జడ్పిటీసీ సభ్యులు పుప్పాల శంకర్ , కోటగిరి మాజీ యంపిటీసీ సభ్యులు కొట్టం మనోహర్, మార్కెట్ కమిటీ చైర్మన్ గైక్వాడ్ హన్మంతు , పోతంగల్ గ్రామ పార్టీ అధ్యక్షులు పుల్కంటి సాయిలు , నభీ, రాజు, గణేష్, లింగయ్య, సుభాష్, మండలంలోని అన్ని గ్రామాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కార్యకర్తలు, పాల్గొనడం జరిగింది.



# అన్నా చెల్లెల అనుబంధానికి, అక్క తమ్ముళ్ల అనురాగానికి ప్రతీక రాఖీ పండుగ...

**ఎమ్మెల్యే పోచారం**

**టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:**



రాఖీ పౌర్ణమి ( రక్షా బంధన్ ) సందర్భంగా బాన్సువాడ లోని తన నివాసంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస రెడ్డికి రాఖీ కట్టిన అక్క దొడ్ల సత్యవతి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత న్నా చెల్లెళ్ల అనుబంధానికి, అక్కా తమ్ముళ్ల అనురాగానికి ప్రతీక రాఖీ పండుగ అని తెలిపారు. ఈ రక్షా బంధన్ వేడుకను ఘనంగా జరుపుకోవాలనిఆకాంక్షిస్తూ...తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపిన పోచారం. ఈ కార్యక్రమంలో పోచారం శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులు, తదితరులు, పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఖాతాల్లోకి బిల్లులు

**టైమ్స్ ఆఫ్ వార్త - గాంధారి**

గాంధారి మండలంలోని గౌరారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు శుభవార్త అందింది. గుండ్ల గంగమణి, వడ్ల సుజాత అనే ఇద్దరు లబ్ధిదారుల బేస్మెంట్ బిల్లుల కింద ఒక్కొక్కరికి 1,00,000 చొప్పున వారి ఖాతాల్లో జమ అయినట్లు కాంగ్రెస్ మండల యూత్ ఉపాధ్యక్షులు ఎం. లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ చొరవ వల్లనే సొంత ఇంటి కల నెరవేరిందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. తమ కలను సాకారం చేసిన ఎమ్మెల్యే మదన్ మోహన్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధారి మండల యూత్ ఉపాధ్యక్షులు మేల్దే లక్ష్మణ్, గ్రామ అధ్యక్షులు కమ్మరి సంగమేష్, యూత్ అధ్యక్షులు గైని బాలు, రాములు, అంజయ్య, గౌరారం శ్రీనివాస్, ఆంజనేయులు, అహ్మద్‌తో పాటు లబ్ధిదారులు పాల్గొన్నారు.



# గద్దెరాగడి పద్మావతి కాలనీలో దొంగతనం

**చోరికి గురైన 13 తులాల బంగారు ఆభరణాలు**

**చోరీకి పాల్పడ్డ గుర్తు తెలియని దొంగలు**

**టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-**

జిల్లాలోని గద్దెరాగడి ఏరియాలో గల పద్మావతి కాలనీలోని ఒక ఇంట్లో గుర్తుతెలియని దొంగలు దొంగతనం చేసి, 13 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. రామకృష్ణాపూర్ ఎస్ఐ జి రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం, భూపాలపల్లి ఏరియాలో సింగరేణి ఉద్యోగం చేస్తున్న మేకల రాజయ్య రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల గద్దెరాగడి పద్మావతి కాలనీలో నూతన ఇంటి నిర్మాణం చేసుకున్నాడు. శుక్రవారం వరలక్ష్మీ వ్రతం నిర్వహించేందుకు భూపాలపల్లి నుండి కుటుంబ సమేతంగా కొత్త ఇంటికి వచ్చి, పూజ అనంతరం రాత్రి అందరూ ఇంట్లో నిద్రించారు. ఉదయం లేచి చూసేసరికి ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. అదేవిధంగా రాత్రి నిద్రపోయే ముందు బ్యాగులో పెట్టినటువంటి 13 తులాల బంగారు ఆభరణాలు కనబడలేదు. వెంటనే బాధితుడు రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన బంగారం విలువ సుమారు 2,86,000 రూపాయల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు. దొంగతనంపై అందిన ఫిర్యాదు మేరకు వెంటనే పోలీస్ ఉన్నతాధికారుల ఉత్తర్వుల ప్రకారం దొంగలను పట్టుకున్నందుకే సమీపంలో గల సీసీ




కెమెరాలను పరిశీలించడం జరుగుతుందని, పోలీస్ సిబ్బందిని ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి, తనిఖీలు చేయడం ప్రారంభించామని, త్వరలోనే దొంగలను పట్టుకుంటామని తెలిపారు. సంఘటన స్థలాన్ని బెల్లంపల్లి ఏసిపి ఏ రవికుమార్, మందమర్రి సిఐ కే శశిధర్ రెడ్డి, మందమర్రి ఎస్ఐ ఎస్ రాజశేఖర్ లు సందర్శించి, విచారణ నిర్వహించారు. డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు నిర్వహించారు.

since 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
ఆదివారం,
10-08-2025



# అన్న చెల్లెళ్ల మధ్య ప్రేమ అను రాగాలకు ప్రతీక రాఖీ పౌర్ణమి

### రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి





టైమ్స్ ఆఫ్ వార్త - యాదాద్రి జిల్లా ప్రతినిధి

రక్తం పంచుకుని పుట్టకన్నా కా చెల్లి అన్నా తమ్ముడు అని ఆర్థికంగా పెంచుకునే బంధానికి కుల మతాలు లేవు అలాంటి ఆప్యాయత అభిమానం అనురాగాలు వేడుక రాఖీ పండుగ అని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆయన నియోజకవర్గం లోని అక్క చెల్లెలు అన్న తమ్ముళ్లకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రక్తం పంచుకొని పుట్టకన్నా అక్క చెల్లి అన్న తమ్ముడు అని పిలుచుకునే బంధానికి కులమతాలు ఉ ఒడవని అలాంటి ఆప్యాయతల, అభిమాన నువ్వు రాగల మధ్య జరుపుకునే వేడుక రాఖీ పండుగని అభివర్ణించారు. ఈ వేడుకను అందరు ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వారి సోదరి అద్భుతంగా రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

## మాజీ ఎండిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డికి రాఖీ కట్టిన సోదరి

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:



రాఖీ పౌర్ణమి సందర్భంగా హైదారాబాద్ లోని తన నివాసంలో మాజీ డీసీసీబీ చైర్మన్, బాన్సువాడ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోచారం భాస్కర్ రెడ్డి కి రాఖీ కట్టిన అక్క పోచారం అరుణ . అక్కా-తమ్ముడు, అన్నా-చెల్లెలు అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ, సోదరీమణులకు అందరికీరాఖీపౌర్ణమిశుభాకాంక్షలు తెలిపిన భాస్కరెడ్డి.కార్యక్రమంలో పోచారం భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులు, తదితరులు, పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ వేడుకల్లో పాల్గొన్న పోచారం శ్రీనివాస్ రెడ్డి


టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ



బాన్సువాడ నియోజకవర్గం బీర్కుర్ మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులోని తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానంలో, బాన్సువాడ పట్టణ కేంద్రంలోని కోటగల్లి లోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రావణమాసంలో వచ్చిన శ్రవణా నక్షత్రం సందర్భంగా అంగరంగ వైభవంగా జరిగిన శ్రీ వెంకటేశ్వర స్వామివారికళ్యాణమహొత్సవంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వవ్యవసాయసలహాదారులు బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి ,ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు ,పోచారం శంభురెడ్డి . అనంతరం బాన్సువాడ పట్టణంలోని శ్రీ మార్కండేయ స్వామి ఆలయంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రతి ఏట పద్మశాలిసంఘంఆధ్వర్యంలో ఏర్పాటు చేసే జంజీరాల పౌర్ణమి ఉత్సవాలలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన పోచారం శ్రీనివాస్ రెడ్డి ,కాసుల బాలరాజు.తదుపరి తాడ్కోల్ రైస్మిల్ వద్ద బాన్సువాడ సంగమేశ్వర కాలనీ శ్రీ మంజునాథ గణేష్ మండలి ( టీం గరుడ ) వారి ఆధ్వర్యంలో 18 అడుగుల భారీ గణేష్ విగ్రహం ఆగమన కార్యక్రమానికి హాజరైన పోచారం శ్రీనివాసరెడ్డి ,,కాసుల బాలరాజు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బాన్సువాడ పట్టణ, బిర్కూర్మండలప్రజాప్రతినిధులు, నాయకులు,భక్తులు, పాల్గొన్నారు.

## రాహుల్ ప్రశ్నలకు యూపీ సీఈఓ పొంతనలేని సమాధానాలు

(మొదటి పేజీ తరువాయి)..




అంతేకాకుండా ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి కంటోన్మెంట్ స్థానంలో కూడా అదే ఎపిక్ నెంబరుతో ఓటుంది. రాహుల్ ఆరోపణలపై ఉత్తరప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) అదే రోజు స్పందించారు. ఆదిత్య శ్రీవాత్సవ, విశాల్ సింగ్‌లకు యూపీలో ఓటు లేదని చెప్పారు. ఎన్నికల కమిషన్ వెబ్‌సైటు ప్రకారం వారికి మహదేవ్‌పురా శాసనసభ స్థానంలోనే ఓటు హక్కు ఉన్నదని తెలిపారు. మరి రాహుల్, సీఈఓల వాదనల్లో ఎవరిది నిజం? రాహుల్ మార్చి 16న ఈసీ వెబ్‌సైటు నుంచి స్క్రీన్‌షాట్ తీసుకున్నారు. ఈ నెల 7న ఈసీ వెబ్‌సైటులో ఎపిక్ నెంబర్ ఆధారంగా వెతకగా లభించిన సమాచారాన్ని సీఈఓ ఉటంకించారు. యూపీ సీఈఓ ప్రకటనలో వాస్తవాన్ని తెలుసుకునేందుకు 'ది వైర్' పోర్టల్ ప్రయత్నించింది. లక్నో ఈస్ట్, వారణాసి కంటోన్మెంట్ స్థానాలకు సంబంధించి ఎన్నికల కమిషన్ 2024 అక్టోబర్ 29న ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జబితాలు, ఈ ఏడాది జనవరి 7న ప్రచురించిన తుది జాబితాలలో వారిద్దరి పేర్లు, ఎపిక్ నెంబర్లను (రాహుల్ షేర్ చేసినవి) వెతికింది. ఈ జాబితాలలో వారిద్దరి పేర్లూ కన్పించాయి. రాహుల్ షేర్ చేసిన స్క్రీన్‌షాట్లతో ఇద్దరి ఎపిక్ నెంబర్లు సరిపోయాయి. ఇక ఎన్నికల కమిషన్ వెబ్‌సైటులో అందుబాటులో ఉన్న ముసాయిదా ఓటర్ల జాబితా, తుది జాబితాలలో ఉన్న సమాచారానికి, యూపీ సీఈఓ చేసిన ప్రకటనకు పొంతన కుదరడం లేదు. అంటే ఎన్నికల అధికారి ప్రకటన తప్పుదోవ పట్టించేలా ఉన్నదని, అందులో ఏ మాత్రం నిజం లేదని స్పష్టమవుతోంది. యూపీ సీఈఓ చేసిన ప్రకటనను జాగ్రత్తగా గమనిస్తే అందులో మరిన్ని తప్పులు కన్పించాయి. మహదేవ్‌పురా శాసనసభ స్థానంలోని పోలింగ్ కేంద్రం నెంబర్ 458లో ఆదిత్య శ్రీవాత్సవ పేరు వరుస నెంబరు 1265లో ఉన్నదని ఆ అధికారి తెలిపారు. అయితే ఆదిత్య శ్రీవాత్సవ ఎపిక్ నెంబరుతో వెతకగా ఓటరు వివరాలలో తేడా కన్పించింది. ఆదిత్య శ్రీవాత్సవ తండ్రి పేరు కాకుండా అక్కడ బంధువు పేరు ఉంది. ఇక్కడ గమనించాల్సిన మరో విషయమేమంటే ఆదిత్య శ్రీవాత్సవ పేరు తండ్రి పేరుతో సహా లక్నో ఈస్ట్ స్థానం ఓటర్ల జాబితాలో ఉంది. ఎపిక్ నెంబరు మాత్రం వేరేలా ఉంది. ఉత్తరప్రదేశ్ సీఈఓ చేసిన ప్రకటన ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నదని, సరిగా పరిశీలించకుండానే హడావిడిగా జారీ చేశారని దీనినిబట్టి అర్థమవుతోంది.

## బాన్సువాడలో శ్రీకృష్ణ జన్మాష్టమి కరపత్రాలు, గోడ ప్రతుల ఆవిష్కరణ...

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:



బాన్సువాడ వ్యాయమశాల ఇస్కాన్ సత్సంగ భవనంలో శ్రీకృష్ణ జన్మాష్టమి కరపత్రాలను వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఆగస్టు 10 నుంచి ఆగస్టు 17 వరకు కామారెడ్డి ఇస్కాన్ సత్సంగంలో ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని కామారెడ్డి జిల్లా ఇస్కాన్ ప్రతినిధి వెంకట దాసు ప్రభు జి, గురు వినయ్ కుమార్, మల్లికార్జున్ గురుస్వామి తెలిపారు. ముఖ్యంగా ఆగస్టు 15 న ఉదయం 11:30 నిమిషాలకు ఉచితంగా శ్రీకృష్ణ హెూమం, 16న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అర్ధరాత్రి వరకు జరుగుతాయని తెలిపారు. 17వ తారీఖున నందోత్సవం, శ్రీల ప్రభుపాద వ్యాస పూజ కార్యక్రమం ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి బాన్సువాడ, జుక్కల్, కామారెడ్డి ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.

## ఘనంగా సంతోషిమాత జన్మదిన వేడుకలు..

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ



బాన్సువాడ పట్టణంలోని సంతోషిమాత ఆలయంలో శనివారం సంతోషిమాత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారి జాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకం చేసి, నామకరణ డోలహరణ చేసి, పల్లకి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం, రాఖీ పౌర్ణ మహెూత్సవం ఆలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో కోటి దత్తాత్రి, కోటి సంతోష్, శంకర్ గురుస్వామి, మల్లికార్జున్ గురుస్వామి, రాజు గురు స్వామి, అశోక్ రావు సంతోషి మాత భక్తులు పాల్గొన్నారు.

## పాఠశాలలో ఆదివాసి దినోత్సవం..

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

బాన్సువాడ నియోజకవర్గం నసూర్లాబాద్ మండలంలోని నాచుపల్లి మినీ గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో శనివారం నాడు ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రియదర్శిని మాట్లాడుతూ ఆదివాసి సంస్కృతి, జీవన విధానాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆదివాసి వేషధారణలో నృత్యాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు, పాల్గొన్నారు.




## బోర్లంలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు..

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:



బాన్సువాడ గ్రామీణ మండలం బోర్లం గ్రామం మాజీ ఎంపిటిసి సభ్యురాలు పెద్దప్పట్లోళ్ల శ్రావణి దేవేందర్ రెడ్డి కుమారుడికి శనివారం రాఖీపౌర్ణమి సందర్భంగా పట్లోళ్ల నిశాంత్ రెడ్డికి తన సహెూదరిలు సమన్విత రెడ్డి, సాయిశ్రీరెడ్డి ఇద్దరూ రాఖీ కట్టి ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బోర్లం మాజీ ఎంపీటీసీ దంపతులు పెద్ద పట్లోళ్ల శ్రావణి దేవేందర్ రెడ్డి, నవనిత రెడ్డి పట్లోలవిజయ,లక్కీ తదితరులు, పాల్గొనడం జరిగింది.

## బాన్సువాడ ఆర్టీసీ ప్రాంగణంలో ఘనంగా రక్షాబంధన్ మహెూత్సవ వేడుకలు




టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

బాన్సువాడ రెవెన్యూ డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ డిపో ప్రాంగణంలో శనివారం నాడు రక్షాబంధన్ మహెూత్సవ వేడుకలను ఆర్టీసీ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. విధుల్లో ఉన్న డ్రైవర్లను సహచర కండక్టర్ సోదరీమణులు రాఖీలు కట్టారు. అక్క చెల్లెలు, అన్నదమ్ముల అనుబంధానికి ప్రతీక అయిన రక్షాబంధన్ ఉత్సవ వేడుకలను ఆర్టీసీ ప్రాంగణంలో నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని కార్మికులు తెలిపారు. అత్యవసర విధుల్లో ఉన్న తమకు రాఖీ పండుగ జ్ఞాపకాన్ని గుర్తుచేసిన సహచర కండక్టర్సోదరీమణులకు అభినందనలు, కృతజ్ఞతలు, తెలియజేశారు. "నువ్వు నాకు రక్ష" "నేను నీకు రక్ష" మనం ఇరువురం కలిసి మన కుటుంబానికి, దేశానికి రక్ష" అంటూ రాఖీలు కట్టి, స్వీట్లు పంచుకొని, ఆడపడుచుల ఆశీర్వాదాలు తీసుకొని, ఆనందలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి డ్రైవర్ బొర్లం ప్రశాంత్ రెడ్డి తో పాటు సమాచారం ఆర్టిసి ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

## రాఖీ వేడుకలలో టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం..

### రాఖీ కట్టిన ఏఎంసీ చైర్మన్ పుష్పా రెడ్డి..

టైమ్స్ ఆఫ్ వార్త- కూకట్ పల్లి



కూకట్ పల్లి నియోజకవర్గంలో ఏఎంసీ చైర్మన్ పుష్పా రెడ్డి నివాసంలో నిర్వహించిన రాఖీ వేడుకలకు హాజరైన టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం మహిళా సోదరీమణులందరు రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మీ, ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, సీనియర్ మహిళా కాంగ్రెస్ నాయకురాలు రేష్మా, డివిజన్ మహిళా అధ్యక్షురాళ్లు విజయలక్ష్మీ, మారుతీ తదితరులు, పాల్గొన్నారు..

## నిజాయితీ చాటుకున్న హెూం గార్డ్..

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:



బాన్సువాడ నియోజకవర్గం బీర్కూరు మండలం తిమ్మాపూర్ వెంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చిన ఓ మహిళ భక్తురాలు తన పర్సును పోగొట్టుకుంది. అందులో సుమారు 5 వేల వరకు నగదు ఉండడంతో మహిళ ఆందోళన చెందింది. విషయం తెలుసుకున్న హెూం గార్డ్ పర్సును వెతికిపట్టుకుని మహిళకు అప్పగించాడు. నిజాయితీ చాటుకున్న హెూంగార్డు రమేష్ ను భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది అభినందించారు. ఆ మహిళ కుటుంబ సభ్యులు భక్తులు సంతోషం వ్యక్తం చేసారు.

## టీచర్స్ కాలనీలో రక్షాబంధన్ మహెూత్సవ వేడుకలు..



టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

బాన్సువాడ రెవెన్యూ డివిజన్ కేంద్రంలోని టీచర్స్ కాలనీలో శనివారం నాడు రక్షాబంధన్ వేడుకలు మతసామరస్యాన్ని చేటాయి. కాలనీలోని మహిళలు కాంగ్రెస్ నాయకుడు గౌస్ పాషాకు రాఖీలు కట్టారు. తాము అన్నదమ్ములు, అక్క చెల్లెలుగా కలిసిమెలిసి ఉంటామని ఈ సందర్భంగా గౌస్ పషా తెలిపారు. అందరు స్వీట్లు పంచుకొని, పెద్దల ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీచర్స్ కాలనీ మహిళలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు, పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహానికి రాఖీ.. అన్నాచెల్లెలు బంధానికి ప్రతీక రాఖీ

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:



బాన్సువాడ నియోజకవర్గం దుర్కి గ్రామానికి చెందిన చెందిన ఒక యువకుడు వినూత్నంగా అన్నాచెల్లెలు బంధాన్ని గుర్తుచేశారు. రాఖీ పండుగ సందర్భంగా గ్రామానికి చెందిన తెలంగాణ స్టూడెంట్ పరిషత్ అధ్యక్షులు మావురం శ్రీకాంత్ కుటుంబ సభ్యులతో కలిసి స్థానికంగా ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి స్వయంగా రాఖీ కట్టారు.అంబేద్కర్ సమాజానికి సమానత్వం,సోదరభావం, హక్కుల కోసం పోరాడిన మహనీయుడని, ఆయనను అన్నగా భావించి కుమారుడు సాయి తేజ్, కుమార్తె వర్షిని తో కలిసి రాఖీ కట్టడం తనకు గర్వకారణమని తెలిపారు.ఈ సంఘటన స్థానిక ప్రజల్లో ఆసక్తి రేపగా, పలువురు యువకుడి ఆలోచనను అభినందించారు. అన్నాచెల్లెలు బంధం రక్తసంబంధాలకే పరిమితం కాకుండా,స్ఫూర్తిదాతలతోనూఏర్పడవచ్చునిఈ చర్య ద్వారా సందేశంఅందించారు. ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులు, తదితరులు ,పాల్గొన్నారు.

since: 2007
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దిన పత్రిక
www.timesofvartha.com
జనరల్ న్యూస్
GENERAL NEWS
ఆదివారం,
10-08-2025


# బంచరాయితండలో రాఖీ పౌర్ణమి సందడి..

**కులమతాలకతీత సోదరభావ ప్రతీక.**

టైమ్స్ ఆఫ్ వార్త - మహబూబాబాద్ జిల్లాప్రతినిధి

మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బంచరాయితండలో రాఖీ పౌర్ణమి పండుగ ఘనంగా జరిగింది. పిడిఎస్యు రాష్ట్ర నాయకుడు బానోత్ దేవేందర్ నాయక్ ఇంటి వద్ద ఉదయం నుంచే పండుగ సందడి నెలకొంది. పెద్దక్క దేవి, చిన్నక్క విజయ రంగురంగుల రాఖీలు, తీపి వంటకాలు, పసుపు-కుంకుమలతో తమ్ముడి రక్షణ కోసం రాఖీ కట్టి, ఆప్యాయంగా ఆశీర్వదించారు. తల్లి సివి సాంప్రదాయ దీపం వెలిగించి, పూజా కార్యక్రమాలు నిర్వహించగా, దేవేందర్ అక్కల పాదాలకు నమస్కరించి "మీరు నా జీవితానికి అజేయమైన రక్షకవలయం" అని గర్వంగా అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "రాఖీ కులమతాలకు అతీతమైన సోదరభావ ప్రతీక. మనం ఒకరికొకరు రక్షకులుగా నిలవాలి" అన్నారు. అనంతరం చిన్నారులకు బహుమతులు అందించి, గ్రామస్తులతో కలిసి పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. పూలతోరణాలు, ముగ్గులు, పిల్లల సాంప్రదాయ నృత్యాలు ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాత్రివరకు గ్రామం మొత్తం సోదరభావంతో ఉత్సాహంగా కళకళలాడింది.



## ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు..



టైమ్స్ ఆఫ్ వార్త - గాంధారి

గాంధారి మండలంలోని నారాయణగిరి కొండపై కొలువైన మార్కండేయని గుడి లో శని వారం పద్మశాలి కుల సంఘం ఆధ్వర్యంలో రాఖీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. పద్మశాలిలు ప్రతి రాఖీ పౌర్ణమి సందర్భంగా జంజీరాలు వేద పంతులు మంత్ర ధారణ చేసినప్పుడు ప్రతి సభ్యుడు తన మెడలో పాత జంజిరాన్ని కింద నుండి తీసివేసి పై నుండి నూతన జంజీరాన్ని వేసుకోవడం ఆనవాయితీగా వస్తుంది. అయితే రాఖీ పౌర్ణమి జంజిరాల పౌర్ణమి గా పద్మశాలి లు భావిస్తారు. ఈ సందర్భంగా నూతన జంజిరాలను ప్రత్యేకంగా దేవుని ముందు ఉంచి శిర నైవేద్యం సమర్పించి సంఘ ఆధ్వర్యంలో నేను నీకు రక్ష నువ్వు నాకు రక్ష ఇద్దరం కలిసి దేశానికి రక్ష అంటూ రక్షాబంధన్ కట్టుకుంటారు. శివ భక్త మార్కండేయ మందిరం వద్ద శ్రావణమాసం సందర్భంగా భక్తిశ్రద్ధలతో భక్తులు శ్రావణ సోమవారం, శనివారం భక్తులుకు మందిరం వద్ద ప్రత్యేక పూజలు అభిషేకాలు, అర్చనలు, పురోహితులు జరుప బడుతుంది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పద్మశాలి కుల బాంధవులు పాల్గొన్నారు.

# ఆదివాసీల హక్కులు, రక్షణకై పోరాడుదాం

**ఖనిజ దోపిడి కోసం అడవుల నుండి ఆదివాసీలను వెల్లగొట్టె ప్రభుత్వ కుట్రలను ఖండించండి.**

టైమ్స్ ఆఫ్ వార్త - మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి




CPI (ML న్యూ డెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ పోరాట దినోత్సవం పార్టీ జిల్లా నాయకులు సిద్దబోయిన జీవన్ అధ్యక్షతన మహబూబాబాద్ పట్టణం లో గల పార్టీ ఆఫీసులో సదస్సు,కొమరం భీం విగ్రహం వరకు ర్యాలీ జరిగింది. ఈకార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి సనప పొమ్మయ్య పాల్గొని మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ ఆదివాసీ దినం జరుపుతున్నారు. ఆదివాసీలు ప్రపంచంలో అడవులలో క్రూరమృగాల మధ్యన వేల సంవత్సరాలుగా జీవిస్తున్నారు. పోడు వ్యవసాయం,కొండ వ్యవసాయం చేసుకుంటూ ఆదివాసీలు జీవనం సాగిస్తున్నారు,ఆదివాసీలకు రాజ్యాంగం కొన్ని హక్కులు కల్పించింది. పేసా చట్టం,అటవీ హక్కులచట్టం,1/70 చట్టం తో పాటు మరికొన్ని హక్కులను కల్పించింది,కానీ నేడు ప్రభుత్వాలు ఆదివాసీలకు రక్షణగా వుండాల్సిన ప్రభుత్వాలు ఆదివాసీ చట్టాలను,హక్కులను తుంగలో తొక్కి ఆదివాసీలను అడవుల నుండి వెల్లగొట్టే కుట్రలు చేస్తుంది. ఆదివాసీలు జీవిస్తున్న అటవీ ప్రాంతాలలో 46 రకాలకు పైగా అనేక ఖనిజ సంపదలు ఉన్నాయి,ఈ ఖనిజ సంపదలను కార్పొరేట్ శక్తులకు, పారిశ్రామిక వేత్తలకు,అప్పనంగా కట్టబెట్టడం కోసం కుట్రలు చేస్తుంది. ఇందులో భాగంగానే ఆదివాసీలకు,వాళ్ళ హక్కులకి రక్షణగా వున్న విప్లవ కారులను అనిచి వేస్తుంది. ఆపరేషన్ కాగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం మధ్య భారతంలో ఆదివాసీలపై, వాళ్లకు అండగా ఉన్న విప్లవకారులపై పార మిలటరీ బలగాలతో దాడులు కొనసాగిస్తూ భూటకపు ఎన్ కౌంటర్ పేరుతో నిర్ధాక్షణ్యంగా కాల్చి చంపుతున్నారన్నారు. దేశంలో మేదావులు సైతం ఆపరేషన్ కగారుని ఆపాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టి ఆదివాసీలపై,దాడులు కొనసాగిస్తుందన్నారు.ప్రభుత్వాలు ఇప్పటికైనా ఆలోచించి ఆదివాసీల చట్టాలను, హక్కలకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఇంకా ఈకార్యక్రమంలో పార్టీ, ప్రజాసంఘాల జిల్లా, మండల నాయకులు అరెం కోటమ్మ, మదార్. షర్ఫుద్దిన్, బండపల్లి వెంకటేశ్వర్లు, కన్మంతరెడ్డి భాస్కర్ రెడ్డి.జోగా రణధీర్, జాటోత్ బిక్షపతి,చిట్టిబాబు,వంగూరి వెంకన్న,జవ్వాజి బాలయ్య. సట్ల యాకయ్య,కవిత, గణేష్,వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# బంచరాయితండలో రాఖీ పండుగ వేడుకలు...

టైమ్స్ ఆఫ్ వార్త - మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి



మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బంచరాయితండ గ్రామ పంచాయతీలో రాఖీ పౌర్ణమి పండుగను ఈసారి ప్రత్యేకంగా, కుటుంబ సౌభ్రాతృత్వాన్ని ప్రతిబింబించేలా ఘనంగా నిర్వహించారు. బానోత్ రణశ మనవళ్లు విజయ్ నాయక్, కృష్ణ నాయక్, మోహన్ నాయక్, సుమన్ నాయక్‌తో పాటు ముని మనవళ్లు వంశీకృష్ణ, మౌనిక, అరవింద, అంజలి, వరుణ్, సాత్విక, మహేష్, వర్షితుఅందరూ కలిసి ఒకే చోట చేరి ఆనంద వాతావరణాన్ని నెలకొల్పారు. ఉదయం నుంచే పండుగ సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఇంటి ఆవరణను పూలదండలు, మగ్గ రంగులతో అందంగా అలంకరించగా, గాలిలో తీపి వాసనలు వెదజల్లేలా బొబ్బట్లు, లడ్డు, పాయసం వంటి వంటకాలు సిద్ధం చేశారు. సోదరీమణులు సాంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోతూ సోదరుల చేతికీ పవిత్రమైన రాఖీ కట్టి, వారి ఆయురారోగ్యాల కోసం ప్రార్థనలు చేశారు. సోదరులు రాఖీ కట్టిన అక్కలకు బహుమతులు అందజేస్తూ, ఎల్లప్పుడూ రక్షణ వలయంలా ఉండబోతామనే హామీ ఇచ్చారు. పెద్దలు పిల్లలకు పండుగ ప్రాముఖ్యతను వివరిస్తూ, రాఖీ అనేది కేవలం ఒక నూలు దారముకాదు, అది మనసుల బంధాన్ని బలపరచే పవిత్రమైన సంకేతం అని చెప్పారు. చిన్నారులు ఆట పాటలతో, నవ్వులతో అందరినీ అలరించారు. సాయంత్రం వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, కుటుంబ సమూహ ఫొటోలు, చర్చలు సాగి, పండుగ సందడి మరింత ఉత్సాహాన్ని నింపింది. చివరగా, అందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ "మన బంధాలు ఇలాగే తరతరాలకు నిలవాలి" అని అందరూ ఆకాంక్షలు వ్యక్తం చేశారు.

## శివ భక్త మార్కండశ్వర దేవాలయంలో యజ్ఞోపదారణ

టైమ్స్ ఆఫ్ వార్త - సంస్థాన్ నారాయణపురం రిపోర్టర్ గజం శ్రవణ్ నేత



సంస్థాన్ నారాయణపూర్ మండల కేంద్రంలోని శ్రీ శివ భక్త మార్కండశ్వర స్వామి దేవాలయంలో రాఖి పౌర్ణమి మరియు నూలు పుట్టినరోజు సందర్భంగా శనివారం యజ్ఞోపదారణ, హెూమం నిర్వహించి సామూహిక జంజాలుదారాణం నిర్వహించారు. అనంతరం రాపోలు సత్తయ్య -పద్మ ల జ్ఞాపకార్థం వారి కుమారుడు కృష్ణస్వామి- పవిత్ర దంపతులు భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు సూరపల్లి కుచేలు,ఆలయ ప్రధాన కార్యదర్శి గుర్రం వెంకటేష్,ఉపాధ్యక్షులు చెరుపల్లి లక్ష్మయ్య,మిర్యాల రాజరత్నం కోశాధికారి ఏలే నరసింహ,సహాయ కార్యదర్శి చిలుకూరి శ్రీనివాస్ ప్రచార కార్యదర్శులు మేకని శ్రీనివాస్, కర్నాటి నవీన్,కార్యవర్గ సభ్యులు మాకం యాదగిరి, దోర్నాల అంజయ్య, గంజి రాములు మేకల రామకృష్ణ, సురేపల్లి రాములు,సింగం భాస్కర్, పున్న విజయ్ కుమార్, చేనేత సహకారసంఘము మాజీ అధ్యక్షులు చిలుకూరి అంజయ్య,మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సింగం కృష్ణ,పద్మశాలి సంఘం అధ్యక్షుడు సురపల్లి జనార్ధన్, చేనేత సహకార సంఘం ఉపాధ్యక్షుడు సంగిశెట్టి లక్ష్మీనారాయ, ఆలయ అర్చకులు చిట్యాల నరేష్ పంతులు తదితరులు పాల్గొన్నారు

## ఎమ్మెల్యే కృష్ణారావు క్యాంప్ ఆఫీస్‌లో రాఖీ పౌర్ణమి వేడుకలు..

**మహిళలు అందరికి కానుకగా చీరలు పంపిణి.. కృష్ణా రావు**

టైమ్స్ ఆఫ్ వార్త- కూకట్ పల్లి



రాఖీ పౌర్ణమి సందర్భంగా కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంప్ కార్యాలయం లో మహిళలు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ సోదర సోదరీ మణుల ఆత్మీయ బంధాన్ని చాటి చెప్పే రక్షాబంధన్ సందర్భంగా అందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపి వచ్చిన ప్రతి మహిళకు చీర కానుకగా సమర్పించారు.. అందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## శ్రీ వేంకటేశ్వర వేదాంతం వర్ధిని సంస్కృత కళాశాలలో రాఖీ పౌర్ణమి వేడుకలు

**పాల్గొన్న జర్నలిస్టులు నాగరాజ్, మహేందర్ నాయక్.**

టైమ్స్ ఆఫ్ వార్త - కూకట్ పల్లి



తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వేంకటేశ్వర వేదాంతం వర్ధిని సంస్కృత కళాశాల పాఠశాల ప్రపంచ అంతర్జాతీయ సంస్కృత దినోత్సవం, హయగ్రీవ జయంతి, శ్రవణ నక్షత్రం రాఖీ పౌర్ణమి వేడుకలు ప్రిన్సిపాల్ డాక్టర్ బానోత్ సురేందర్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో జంపన ప్రతాప్ జర్నలిస్టులు నాగరాజ్, మహేందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## రాఖీ పౌర్ణమి వేడుకలులో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ మాధవరం రంగా రావు..

టైమ్స్ ఆఫ్ వార్త- కూకట్ పల్లి

శేరీలింగం పల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్‌లోని మహిళా సోదరీమణులు రాఖీ పండుగ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాధవరం రంగా రావు కి రాఖీ కట్టి సోదర భావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ ౦ సోదర సోదరీమణుల బంధం సమాజంలో ఐక్యత, పరస్పర సహకారం, పరిరక్షణకు ప్రతీక అని పేర్కొన్నారు. మహిళల అభ్యున్నతికి, సురక్షిత వాతావరణం కల్పించడానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని హామీ ఇచ్చారు..



## డివిజన్ ప్రజలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు

**కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్**



టైమ్స్ ఆఫ్ వార్త - కూకట్ పల్లి

సోదర సోదరీమణులు అత్యంత పవిత్రంగా వారి బంధం పటిష్టంగా ఉండాలని జరుపుకునే రాఖీ పండుగ సందర్భంగా 124 ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కి, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ కు కార్పొరేటర్ కార్యాలయంలో అడపడుచులందరు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియచేయడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు మాట్లాడుతూ అన్నా చెల్లెళ్ళు అక్కాతమ్ముళ్ళ మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా జరుపుకునే రాఖీ పండుగకు ఎంతో విశిష్టత ఉందని అన్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ రాఖీ పండుగను జరుపుకుంటారన్నారు. సోదరి తన సోదరుడికి రాఖీ కట్టి ఎప్పుడూ అన్న తనకు రక్షగా, తాను అన్నకు అండగా ఉండాలని కోరుకుంటుంది. సోదరి కట్టిన రక్షాబంధనాన్ని స్వీకరించిన అన్న తానెప్పుడూ చెల్లెలికి రక్షగా ఉంటానని రాఖీ ద్వారా తెలియజేస్తారని గుర్తుచేశారు. రాఖీ కట్టిన సోదరీమణులు అందరికి కార్పొరేటర్ బహుమతులు అందించి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియచేసారు. కార్యక్రమంలో ఆల్విన్ కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మళ్లీ వస్తున్న 'శివ'

ఇండియన్ సినిమాల్లో మైలురాయిగా నిలిచిన శివ ముప్పై ఏళ్ల తర్వాత మళ్లీ చరిత్ర సృష్టించడానికి సిద్ధమవుతోంది. ఈ సారి సౌండ్ మొత్తం హై ఎండ్ ఎఐ టెక్నాలజీతో రీ-డిజైన్ చేశారు. అన్నపూర్ణ స్టూడియోస్ ప్రొడక్షన్‌లో, రామ్ గోపాల్ వర్మ దర్శకత్వం వహించిన శివ సినిమా రియలిస్టిక్ యాక్షన్ సీక్వెన్సెస్‌తో కొత్త ట్రెండ్‌ను సృష్టించింది. బాక్సాఫీస్ రికార్డులను బద్దలు కొట్టడంతో పాటు విమర్శకుల ప్రశంసలను అందుకుంది. సిఎన్ఎన్ఐబిఎన్ టాప్ 100 ఇండియన్ ఫిలిమ్స్‌లో స్థానం సంపాదించింది. ఇప్పుడు అన్నపూర్ణ స్టూడియో 50వ వార్షికోత్సవం సందర్భంగా, మళ్లీ థియేటర్స్‌లోకి వస్తోంది. ఈ రీ-రిలీజ్ గురించి నాగార్జున మాట్లాడుతూ "శివ నన్ను ఐకానిక్ హీరోగా నిలబెట్టిన సినిమా. నా క్యారెక్టర్ మరిచిపోలేని స్థాయికి వెళ్లింది. ఇన్ని ఏళ్ల తర్వాత కూడా ఈ సినిమాను గురించి మాట్లాడుకుంటూ ఉండటం చూసి, నా అన్నయ్య వెంకట్ అక్కినేని, నేను కలిసి, దీన్ని గ్రాండ్‌గా రీ-రిలీజ్ చేయాలని భావించాం. ఈ సినిమాను కల్ట్ క్లాసిక్‌గా ప్రేక్షకులకే కాకుండా, యూట్యూబ్‌లో చూసిన కొత్త తరానికి కూడా థియేటర్‌లో అనుభవం ఇవ్వాలని అనుకున్నాం.